ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

జాతీయ వార్తలు

తేదీ: 10.10.2024 సమయం 19.05 గంటలు

ముఖ్యాంశాలు

1. ఆసియాన్ దేశాలతో భారత్ సంబంధాలకు యాక్ట్ ఈస్ట్ పాలసీ నూతన శక్తిని, గమనాన్ని, దిశను అందించిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు.

2. కేంద్ర ప్రభుత్వం పలు రాష్ట్రాలకు రాష్ట్రాల వాటా కింద సుమారు లక్షా 78 వేల కోట్ల పన్నుల పంపిణీని ఈరోజు విడుదల చేసింది. తెలంగాణకు 3 వేల 745 కోట్ల రూపాయలు విడుదలయ్యాయి.

3. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈరోజు ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ టెలి మానస్ యాప్ ను, వీడియో కాల్ సౌకర్యాన్ని ప్రారంభించింది.

4. ప్రముఖ పారిశ్రామికవేత్త, పద్మవిభూషణ్ గ్రహీత, టాటా సంస్థ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా అంత్యక్రియలు కొద్ది సేపటి క్రితం ముంబయిలోని వర్లి శ్మశాన వాటికలో ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు.

## EVE-PM LAOS

ఆసియాన్ దేశాలతో భారత్ సంబంధాలకు యాక్ట్ ఈస్ట్ పాలసీ నూతన శక్తిని, గమనాన్ని, దిశను అందించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. 21 వ శతాబ్ధం భారత్, ఆగ్నేయాసియా దేశాలదే అన్నారు. లావో పీపుల్ డెమోక్రటిక్ రిపబ్లిక్ లోని వియాంటియాన్ లో జరిగిన భారత్ – ఆసియాన్ సదస్సులో ప్రధానమంత్రి మాట్లాడుతూ ఏసియాన్ దేశాలు శాంతికాముక దేశాలని, పొరుగు దేశాల జాతీయ సమగ్రతను, సార్వభౌమత్వాన్ని పరస్పరం గౌరవిస్తాయని అన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్తతలు నెలకొన్న తరుణంలో భారత్- ఆసియాన్ దేశాల మధ్య స్నేహం, సహకారం, చర్చలు, భాగస్వామ్యం చాలా ముఖ్యమని అన్నారు. గడచిన పదేళ్లలో ఏసియాన్ ప్రాంతంలో వాణిజ్యం రెట్టింపు మేర పెరిగి 130 బిలియన్ డాలర్లకు చేరుకుందని వివరించారు. భారత్ నుంచి ఆసియాన్  లోని ఏడు దేశాలకు నేరుగా విమాన సౌకర్యం ఉందని ప్రధానమంత్రి మోదీ తెలిపారు. బ్రూనై కు త్వరలోనే విమాన సర్వీసులను ప్రారంభిస్తామని తెలిపారు. టిమోర్ లెస్టెలో భారత్ రెండు రాయబార కార్యాలయాలు ప్రారంభించినట్టు గుర్తు చేశారు. ఆసియాన్ ప్రాంతంలో భారత్ తో ఫిన్ టెక్ సహకారం ఏర్పాటు చేసుకున్న మొదటి దేశం సింగపూర్ అని తెలిపారు. ఈ మధ్యాహ్నం వియాంటియాన్ చేరుకున్న ప్రధానమంత్రికి లావో పీడీఆర్ హోం మంత్రి విలైవోంగ్ బౌద్ధాఖం స్వాగతం  పలికారు. ఆ తర్వాత లుయాంగ్ ప్రాబాంగ్ లో ప్రతిష్టాత్మక రాయల్ థియేటర్లో లావో రామాయణం – ఫలక్ ఫలం లేదా ఫ్రా లక్ ఫ్రారామ్ ప్రదర్శనను తిలకించారు. ఇది రామాయణ ఇతిహాసానికి లావో అనుసరణ.

## INDIA-ASEAN JOINT STATEMENT

కాగా విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, వాతావరణ చర్యలు తదితర అంశాలపై భారత్, ఆగ్నేయాసియా దేశాలు (ఏసియన్) మధ్య డిజిటల్ పబ్లిక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ DPI విషయంలో సహకార ఆవశ్యకత ప్రాధాన్యాన్ని స్పష్టం చేశాయి. డిజిటల్ సౌకర్యాలను ముందుకు తీసుకువెళ్లేందుకు పరిజ్ఞానం తదితర అంశాలను, డీపీఐను ప్రోత్సహించడానికి

అనుసరించాల్సిన ఉత్తమ పద్ధతులు పరస్పరం పంచుకోవాల్సిన ఆవశ్యకతను భారత్ - ఆసియాన్ దేశాలు గుర్తించాయి. ద్వైపాక్షిక ఆర్థిక భాగస్వామ్యానికి ఫిన్ టెక్, నూతన ఆవిష్కరణలు ప్రధానమైనవని, సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో సైబర్ సెక్యూరిటీలో సహకారం కీలకమైన భాగమని గుర్తించారు.

## GOVERNMENT-TAX DEVOLUTION

కేంద్ర ప్రభుత్వం పలు రాష్ట్రాలకు రాష్ట్రాల వాటా కింద సుమారు లక్షా 78 వేల కోట్ల పన్నుల పంపిణీని ఈరోజు విడుదల చేసింది. తెలంగాణకు 3 వేల 745 కోట్ల రూపాయలు విడుదలయ్యాయి.రాబోయే పండుగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని, రాష్ట్రాలు మూలధన వ్యయాన్ని వేగవంతం చేయడానికి, వారి అభివృద్ధి, సంక్షేమ సంబంధిత వ్యయాలకు ఆర్థిక సహాయం చేయడానికి ముందస్తు వాయిదాను విడుదల చేసినట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. ఉత్తర ప్రదేశ్ కు గరిష్టంగా 31 వేల 962 కోట్లు లభించగా, తరువాత బీహార్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు, ఉన్నాయి. తెలంగాణకు 3 వేల 745 కోట్ల రూపాయలు విడుదలయ్యాయి.

## TELE MANAS

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈరోజు ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ టెలి మానస్ యాప్ ను, వీడియో కాల్ సౌకర్యాన్ని లాంఛనంగా ప్రారంభించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ డబ్ల్యూహెచ్ఓ టెలి మానస్ అసెస్మెంట్ రిపోర్టును, ఉద్యోగుల కోసం సెల్ఫ్ కేర్ మాడ్యూల్ ను ప్రారంభించింది. పని చేసే ప్రదేశాల వద్ద మానసిక ఆరోగ్యాన్ని ఈ సంవత్సరం ఇతివృత్తంగా ప్రకటించారు. టెలి మానస్ హెల్ప్ లైన్ ను ప్రారంభించి నేటితో రెండు సంవత్సరాలు పూర్తయింది. ఈ సందర్భంగా మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి ఆరాధన పట్నాయక్ మాట్లాడుతూ... కార్యాలయంలో మానసిక ఒత్తిడిని నియంత్రించేందుకు

మార్గాలు వెతకాలని, పని, జీవితం మధ్య గల సమతౌల్యం తో మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చని తెలిపారు.

**J&K POLITICAL DEVELOPMENTS**

జమ్ము కశ్మీర్ లో నేషనల్ కాన్ఫరెన్స్ శాసనసభా పక్షనేతగా ఆ పార్టీ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో 42 మంది ఎమ్మెల్యేలతో అతి పెద్ద పార్టీగా నేషనల్ కాన్ఫరెన్స్ అవతరించింది. కూటమి పార్టీలైన కాంగ్రెస్, CPI Mతో శ్రీనగర్ లో శాసనసభాపక్ష సమావేశం నిర్వహించి ప్రభుత్వ ఏర్పాటుపై చర్చించారు. మరో నలుగురు స్వతంత్ర్య అభ్యర్థులు కూడా నేషనల్ కాన్ఫరెన్స్ కు మద్దతు తెలిపారు. మీడియా ప్రతినిధులను ఉద్దేశించి ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ... కాంగ్రెస్ నుంచి మద్దతు లేఖ అందిన తర్వాత లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాను కలసి ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి కోరతామని తెలిపారు.

## TEXTILE SECTOR GROWTH

2030 నాటికి భారత వస్త్ర పరిశ్రమ 350 బిలియన్ డాలర్ల పెరుగుదలను సాధించవచ్చని టెక్స్ టైల్ మంత్రిత్వ శాఖ అంచనా వేసింది. ఆగస్టు 2024 కు సంబంధించిన దేశ వాణిజ్య సమాచారాన్ని బట్టి రెడీమేడ్ వస్త్రాల పై ప్రతి సంవత్సరం 11 శాతం చొప్పున పెరుగుదల నమోదవుతోంది. ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేయడం ద్వారా 2030 నాటికి ఈ లక్ష్యాన్ని చేరుకోగలదని టెక్స్టైల్ మంత్రిత్వ శాఖ తెలియజేసింది. రానున్న మూడు నుంచి ఐదు సంవత్సరాలలో పీఎం మిత్ర పథకం, PLI పథకం ద్వారా 90 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు రావచ్చని మంత్రిత్వ శాఖ అభిప్రాయపడింది. నేషనల్ టెక్నికల్ టెక్స్టైల్స్ మిషన్ వంటి పథకాల ద్వారా భారతదేశం టెక్స్టైల్ రంగంలో అత్యున్నత స్థానం సాధించగలరని మంత్రిత్వ శాఖ అశాభావం వ్యక్తం చేసింది.

**EBSB:**

ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కింద యువ సంగం 5వ దశ నమోదు పోర్టల్‌ను కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఈరోజు ప్రారంభించింది. యువ సంగం దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన యువత మధ్య సంబంధాలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్. 18 నుంచి 30 ఏళ్ల వయస్సు లోపు యువత, ప్రధానంగా విద్యార్థులు, NSS/NYKS వాలంటీర్లు, ఈనెల 21వ తేది వరకు చేసుకున్న రిజిస్ట్రేషన్‌లను ఆమోదిస్తారు. తెలంగాణ రాష్ట్రాన్ని హిమాచల్ ప్రదేశ్‌తో జత చేశారు.

**TATA FUNERAL:**

ప్రముఖ పారిశ్రామికవేత్త, పద్మవిభూషణ్ గ్రహీత, టాటా సంస్థ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా అంత్యక్రియలు కొద్ది సేపటి క్రితం ముంబయిలోని వర్లి శ్మశాన వాటికలో ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించారు. మహారాష్ట్ర పోలీసులు తుపాకులతో గౌరవ వందనం సమర్పించారు. అంతకుముందు ముంబయిలోని ఎన్‌సీపీఏ గ్రౌండ్ నుంచి వర్లి శ్మశానవాటిక వరకు అంతిమయాత్ర సాగింది. ఆయనను చివరి సారి చూసేందుకు వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అంత్యక్రియలకు హోం మంత్రి అమిత్‌షా హాజరయ్యారు.

**PROGRAMME:**

బతుకమ్మ పండుగ ముగింపు రోజైన సద్దుల బతుకమ్మ పండుగను ఈరోజు సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. అంతకుముందు సచివాలయంలోని అమరవీరుల స్మారక చిహ్నం వద్ద నుంచి 10 వేల మంది మహిళలు పూల బతుకమ్మలతో శోభాయాత్రను రాష్ట్ర మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ కళారూపాయలు, బాణసంచా, లేజర్ షో లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రివర్గ సహచరులు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హాజరవుతారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ బతుకమ్మ పండగను రాష్ట్ర

పండుగగా ప్రకటించి ఘనంగా ఏర్పాట్లు చేసింది. ఈ నేపథ్యంలో బతుకుమ్మ ఆడే ప్రాంతాల్లో వాహనాల రాకపోకలను మళ్లించారు.

**యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్**

తెలంగాణ రాష్ట్రంలోని వెనకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించాలన్న లక్ష్యంతో వివిధ జిల్లాల్లోని 28 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం రేపు శంకుస్థాపన చేయనుంది. ఈ మేరకు మొదటి దశలో చేపట్టనున్న పాఠశాలల పనులపై సంబంధిత జిల్లాల కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఈరోజు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రంగారెడ్డి జిల్లాలోని షాద్ నగర్ నియోజకవర్గంలోని కొందుర్గ్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మధిర నియోజకవర్గంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారని ప్రధాన కార్యదర్శి తెలిపారు.

**SL- VOTING SCHEDULE**

శ్రీలంకలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల కోసం శ్రీలంక ఎన్నికల సంఘం పోస్టల్ ఓటింగ్ కు షెడ్యూల్ ని విడుదల చేసింది. ఈనెల 30వ తారీఖున, వచ్చేనెల 1, 4 తేదీలలో జిల్లా సెక్రటేరియట్ల లోను, ఎలక్షన్ ఆఫీసులలోనూ పోస్టల్ వోటింగ్ జరుగుతుంది. ఈ తేదీలలో తమ పోస్టల్ ఓటు హక్కును వినియోగించుకోలేని వారికి నవంబర్ 7, 8 తేదీలలో ప్రత్యామ్నాయ ఓటింగ్ ను ఏర్పాటు చేస్తామని ఎలక్షన్ కమిషన్ తెలిపింది. ఈనెల 16వ తేదీ లోపు పోస్టల్ ఓటర్ల జాబితాను ఖరారు చేసి, 23వ తేది వరకు ఆ జాబితాలను పోస్టల్ సర్వీస్ లకు పంపిణీ చేస్తారు. తదుపరి అధికారిక పోస్టల్ బ్యాలెట్ పేపర్లు పోస్ట్ ఆఫీస్ లకు పంపిస్తారు. 225 పార్లమెంటు సభ్యులను ఎన్నుకోవడం కోసం శ్రీలంకలో నవంబర్ 14న సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి.